



EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
06-11-2025
పేజీలు: 02


# హైదరాబాద్‌లో పట్టపగలే కత్తులతో నరికి రౌడీ షీటర్ హత్య

హైదరాబాద్‌లో పట్టపగలే కత్తులతో నరికి రౌడీ షీటర్ హత్య. ట్రాన్స్‌జెండర్‌ను అత్యాచారం చేసి డబ్బు చెల్లించే విషయంలో స్నేహితుల మధ్య గొడవ జరిగి హత్య. జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఓ ట్రాన్స్‌జెండర్‌ను 15 రోజుల క్రితం నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన రోషన్ సింగ్(25), మరో ఆరుగురు మిత్రులు. డబ్బు చెల్లింపు విషయంలో గొడవ జరగగా వీరిపై బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు. ట్రాన్స్‌జెండర్‌ను తమపై కేసు పెట్టమని బాలశౌ రెడ్డి ఉసిగొల్పాడని, అతన్ని ఎలాగైనా చంపేస్తానని స్నేహితులతో చెప్పిన రోషన్ సింగ్. ఇది కాస్త తన చెవిలో పడడంతో వాడు నన్ను చంపడమేంటి నేనే వాడిని చంపుతానని పగబట్టిన బాలశౌ రెడ్డి. బుధవారం సాయంత్రం మద్యం తాగి జగద్గిరిగుట్ట బస్టాండ్ వద్దకు వచ్చిన రోషన్ సింగ్, బాలశౌ రెడ్డి, అతని స్నేహితులు ఆదిల్, మహమ్మద్. ఈ సందర్భంలో ఇద్దరి మధ్య గొడవ జరగగా.. రోషన్ సింగ్ చేతులను వెనక నుండి పట్టుకున్న మహమ్మద్.. అతన్ని దారుణంగా కత్తితో పొడిచి పారిపోయిన బాలశౌ రెడ్డి. తీవ్ర గాయాలతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన రోషన్ సింగ్. కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు. మృతుడు రోషన్ సింగ్, నిందితులు బాలశౌ రెడ్డి, ఆదిల్, మహమ్మద్‌లపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని తెలిపిన పోలీసులు.





## మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు

బంగారం ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరిగిన విషయం తెలిసిందే.. నాన్ స్టాప్‌గా రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పసిడి ధరలు.. లక్షా 30 వేల మార్క్ దాటాయి.. ఆ తర్వాత దాదాపు 10 వేల వరకు తగ్గుముఖం పట్టాయి.. అంతేకాకుండా.. ధరల్లో హెచ్చు తగ్గులు నమోదవుతున్నాయి. ఒక్కో రోజు బంగారం, వెండి ధర తగ్గితే.. మరికొన్ని రోజులు పెరుగుతూ వస్తాయి. తాజాగా.. బంగారం, వెండి ధరలు పెరిగాయి.. గురువారం 24 క్యారెట్ల బంగారం పది గ్రాములపై రూ.430 మేర ధర పెరిగింది. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. గురువారం (నవంబర్ 06 2025) ఉదయం నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి..కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి.



## తప్పు చేస్తే ఏ పార్టీ వ్యక్తి అయినా చర్యలు తప్పవు

వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొండా రెడ్డి.. ఇటీవల డ్రగ్స్ వాడుతూ ఈగల్ టీంకు పట్టుబడ్డారు. ఈ క్రమంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కొండారెడ్డి కలిసి ఉన్న ఫోటోలను హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు (గురువారం) మీడియాకు విడుదల చేశారు. ఈ క్రమంలో వైసీపీ నేతలపై హోంమంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ నేతలు డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. డ్రగ్స్, గంజాయి ఏపీలో లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రగ్స్ వద్దు బ్రో అని కూటమి ప్రభుత్వం అంటుంటే... వైసీపీ నేతలు డ్రగ్స్ కావాలి బ్రో అంటున్నారంటూ కామెంట్స్ చేశారు. ఈగల్ వ్యవస్థను ప్రారంభించాక యువత డ్రగ్స్ వాడకం తగ్గించిందన్నారు. విశాఖ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి డ్రగ్స్ వాడుతూ ఈగల్ టీంకు దొరికిపోయారని తెలిపారు. కొండారెడ్డి యువతకు డ్రగ్స్ ఇచ్చి పాడు చేస్తుంటే జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కొండారెడ్డిని పార్టీ నుంచి జగన్ ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. డ్రగ్స్ వాడే వాళ్లకి పార్టీలతో సంబంధం లేదన్నారు. యూనివర్సిటీ విద్యార్థులకు కొండారెడ్డి డ్రగ్స్ ఇస్తున్నాడని తెలిపారు. తప్ప చేస్తే ఏ పార్టీ వ్యక్తి అయినా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.


### జూబ్లీహిల్స్‌కు పెద్ద సర్‌ప్రైజ్

# 4,000 ఇళ్ల నిర్మాణం ప్రారంభం!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సిద్ధంగా కాంగ్రెస్ పార్టీ ప్రచార పర్వాన్ని వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో షేక్ పేట్ డివిజన్‌లో సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు.పారామౌంట్ కాలనీ గేట్-3 నుంచి రోడ్ షో ప్రారంభమై, గేట్-2, గేట్-1 ద్వారా బృందావన్ కాలనీ వరకు కొనసాగింది. అనంతరం ఎంఎస్ అకాడమీ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్ ప్రసంగించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని పదేళ్లుగా బీఆర్ఎస్ పట్టించుకోలేదని తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నగర ప్రజలను ఆకర్షించారు.సీఎం రేవంత్ మాట్లాడుతూ, "ఈ ఎన్నికలు సెంటిమెంట్ కోసం కాదా, లేక అభివృద్ధి కోసం కాదా అనేది ఆలోచించండి. గతంలో పీజేఆర్ కుటుంబసభ్యులపై ఏకగ్రీవంగా చర్చ చేయమని అడిగితే కేసీఆర్ అంగీకరించలేదు. ఇప్పుడు సెంటిమెంట్‌తో బీఆర్ఎస్ నేతలు ఓట్లు కోరుతున్నారు. బెంజ్ కార్లను వదిలి ఆటోల్లో తిరుగుతున్న బీఆర్ఎస్ నేతలు, పీజేఆర్ కుటుంబసభ్యులకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఓటు అడగాలి. జూబ్లీహిల్స్‌కు రూ. 4 వందల కోట్ల నిధులు మేము అందించాము. రాబోయే



రోజుల్లో నియోజకవర్గంలో 4,000 ఇళ్లు నిర్మాణ బాధ్యత మేము తీసుకుంటాము," అన్నారు.సీఎం రేవంత్ తెలిపారు, కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మంత్రి అజారుద్దీన్, నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ ప్రజలకు ఎలాంటి కష్టమూ వచ్చినా అండగా, సేవకులుగా ఉంటారు. జూబ్లీహిల్స్ ప్రాంతం అభివృద్ధిలో వెనకబడిందని, గత బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ మంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఇబ్బందులు లేకుండా చూసామని పేర్కొన్నారు. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నవంబర్ 11న జరగనుంది. ఫలితాలు నవంబర్ 14న వెలువడతాయి.



## హర్యానా ఎన్నికల్లో 25 లక్షల ఓట్ల చోరీ

### రాహుల్ గాంధీ

రాహుల్ గాంధీ ఓట్ల చోరీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల ఓట్లు చోరీకి గురయ్యాయని హెచ్ - ఫైల్స్ పేరుతో డాక్యుమెంట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. దీనికి ఎన్నికల సంఘం సహకరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ను ఓడించేందుకు 'ఆపరేషన్ సర్కార్ చోరీ'ని నిర్వహించారని మండిపడ్డారు. దీనిపై బీజేపీ స్పందిస్తూ ఇవి తప్పుడు వ్యాఖ్యలని సరైన ఆధారాలు లేవని ఖండించింది.

## స్మార్ట్‌ఫోన్లపై 2వేలు పెరిగిన ధర



పండుగపూట డిస్కౌంట్ సేల్ ముగిసింది. ఇక ఇప్పుడు ధరల పెరుగుదల మొదలైంది. స్మార్ట్‌ఫోన్ల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్లపై 2వేలు పెంచేశారు. స్టోరేజ్ కంపోనెంట్ల ధరలు పెరగడంతో మొబైల్ ఫోన్ల ధరలు కూడా పెరిగాయి. దీని ప్రభావం కొత్త ఫోన్లపై పడనున్నది. ఈ ఏడాది చివరలో.. వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజయ్యే కొత్త ఫోన్ల ధరలు ఇక చుక్కలను అంటుతాయని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్త ఫోన్ల మోడళ్లపై 5వేల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. నవంబర్ నాలుగో తేదీ నుంచి కొత్త ధరలు అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు గతంలో వెల్లడించారు. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం వల్ల కూడా ఫోన్ ధరలపై ప్రభావం పడనున్నట్లు తెలుస్తోంది. కాంపోనెంట్ ధరలు పెరిగిన విషయంలో ఆ భారాన్ని ఇప్పటికే కస్టమర్లపై రుద్దుతున్నారు. వీవో టీ సిరీస్, టీ4 లైట్ 5జీ సిరీస్, టీ4ఎక్స్ 5జీ సిరీస్‌పై 1500 పెంచేశారు. ఒప్పోకు చెందిన రెనో 14 సిరీస్, ఎఫ్ 31 సిరీస్‌పై కూడా ధరలను వెయ్యి నుంచి రెండు వేల వరకు పెంచారు.




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై రూ. 500 కోట్ల బెట్టింగ్‌లు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మృతితో ఉప ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ఎన్నికలు గెలుపోటములతో పాటు అభ్యర్థి సాధించే మెజార్టీపైనా, సెకండ్ ప్లేస్ పై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో సుమారుగా రూ.500 కోట్ల మేర పందేలు కాసారని ఈ ఫలితాలు వచ్చే నాటికి రూ.1000 కోట్లకు చేరవచ్చని సమాచారం. 30 శాతం ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థి ఇక్కడ గెలిచే అవకాశం ఉంది.

## చేవెళ్ల రోడ్డు ప్రమాద బాధితురాలిని పరామర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే

కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ కి చెందిన తాడెం వెన్నెల తాండూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ స్టేజి వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనలో ఈమె గాయపడి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి చికిత్స పొందుతున్న ఈమెను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు అధికారులతో మాట్లాడి హాస్పిటల్ లో అయ్యే ఖర్చు ప్రభుత్వం కట్టే విధంగా చేయడం జరిగింది.అలాగే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన రహదారి భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.



## సమంత న్యూ హాట్ లుక్స్

స్టార్ హీరోయిన్ సమంత రుత్ ప్రభు ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, కెరీర్ గురించి నిర్మొహమాటంగా మాట్లాడారు. తాను పరిపూర్ణరాలును కానని, తప్పులు చేశానని, దెబ్బలు తిన్నానని ఆమె అంగీకరించారు. అయితే, ఇప్పుడు మెరుగవుతున్నానని చెప్పారు. తన జీవితంలో జరిగిన ప్రతీ సంఘటన ప్రజల సమక్షంలోనే జరిగిందని, విడాకులు, ఆరోగ్య సమస్యల వంటి సందర్భాలలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో సోషల్ మీడియా ట్రోల్స్ తనను ఎంతగానో వేధించాయని, కొందరు తన వ్యక్తిత్వంపై తీర్పులు కూడా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



మెక్సికో అధ్యక్షురాలికి నడిరోడ్డుపై

## చేదు అనుభవం

మెక్సికోలో దిగ్భ్రాంతికర ఘటన జరిగింది. సాక్షాత్తూ దేశాధ్యక్షురాలే నడిరోడ్డుపై లైంగిక వేధింపులు ఎదుర్కోవడం కలకలం రేపుతోంది. మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ ఇటీవల ఓ బహిరంగ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో స్థానిక ప్రజలతో అధ్యక్షురాలు మాట్లాడుతుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆమెపై చేయి వేస్తూ ముద్దు పెట్టుకోబోయాడు. వెంటనే అధ్యక్షురాలి భద్రతా సిబ్బంది అతడిని పక్కకు నెట్టారు. అయినప్పటికీ అతడు క్లాడియాను అసభ్యంగా తాకుతుండడంతో ఆమె ఇబ్బంది పడుతూ.. అతడి చేతిని పక్కకు నెట్టేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశాధ్యక్షురాలికే భద్రత లేకపోతే సాధారణ మహిళల పరిస్థితేంటని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# రీఎంట్రీ ఇస్తున్న రోజా

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తెలుగు, తమిళ్ చిత్ర పరిశ్రమలను ఓ ఊపు ఊపిన రోజా ఇప్పుడు మళ్లీ సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇవ్వబోతోంది. దాదాపు 125కు పైగా సినిమాలు చేసిన రోజా, రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత సినీ కెరీర్‌కి గుడ్‌బై చెప్పింది. తరువాత 'జబర్దస్త్' టీవీ షో ద్వారా ప్రేక్షకులకి దగ్గరగా ఉన్న రోజా, మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ షోను కూడా వదిలేసింది. దీంతో ఆమె ఇక మళ్లీ సినిమాలు చేయరని అందరూ భావించారు. కానీ, తాజాగా ఆ అంచనాలు తారుమారయ్యాయి.ఏపీ ప్రభుత్వం మారిన నేపథ్యంలో రోజా మళ్లీ సినిమాలు, టీవీ రంగంలో బిజీగా మారుతోంది. ఇప్పటికే పలు టీవీ షోలలో జడ్జిగా, గెస్ట్‌గా హాజరవుతూ రీ-ఎంట్రీ ఇచ్చిన రోజా ఇప్పుడు సినిమా రంగంలోకి కూడా తిరిగి అడుగుపెట్టబోతోంది.రోజా డీ-గ్లామరస్ లుక్‌లో, వయసైపోయిన, బాధతో ఉన్న పెద్దావిడ పాత్రలో కనిపించింది. ఈ లుక్ చూసిన అభిమానులు రోజా మరోసారి నటనతో ఆకట్టుకోబోతోందని కామెంట్లు చేస్తున్నారు. ఇప్పుడీ రీ-ఎంట్రీతో రోజా తిరిగి వరుసగా సినిమాలు చేస్తుందా అన్నది చూడాల్సి ఉంది. అయితే, అభిమానులు మాత్రం ఆమె తిరిగి వెండితెరపై కనిపించబోతుందనే వార్తతో ఉత్సాహంగా ఉన్నారు. చూస్తుంటే రానున్న రోజులలో తెలుగులో కూడా పలు సినిమాలు చేసే అవకాశం ఉందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.




## ఎస్వీయూ పీఎస్ వద్ద హైటెన్షన్..
# భారీగా చేరుకుంటున్న విద్యార్థులు

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ వద్దకు విద్యార్థులు భారీగా చేరుకుంటున్నారు. దీంతో పీఎస్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. యూనివర్సిటీ అధికారులపై విద్యార్థులు, విద్యార్థి సంఘం నేతలు ఫిర్యాదు చేయనున్నారు. కాగా.. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ర్యాగింగ్ కలకలం రేపుతోంది. యూనివర్సిటీలో విద్యార్థులను ప్రొఫెసర్ విశ్వనాథ్ రెడ్డి ర్యాగింగ్‌కు ప్రోత్సహించారంటూ బాధిత విద్యార్థులు ఆరోపించారు. ఈ క్రమంలో ప్రొఫెసర్‌పై ఫిర్యాదు ఇవ్వడానికి యూనివర్సిటీ అధికారులను మూడు రోజులు ముందు విద్యార్థి సంఘాలు కలిశాయి. అయితే ఫిర్యాదు చేయడానికి వెళ్ళిన విద్యార్థులు, విద్యార్థి సంఘం నేతలపై యూనివర్సిటీ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ర్యాగింగ్‌పై యూనివర్సిటీ అధికారులు ఓ కమిటీని వేసి చేతులు దులుపుకున్నారు. అయితే.. ఇప్పటి వరకు ర్యాగింగ్‌పై ఎలాంటి చర్యలు లేకపోగా.. తిరిగి తమపైనే కేసులు నమోదు చేయటాన్ని నిరసిస్తూ ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ వద్దకు విద్యార్థులు, బాధిత విద్యార్థినిలు చేరుకున్నారు. యూనివర్సిటీ అధికారులపై విద్యార్థినిలు, విద్యార్థి సంఘ నేతలు ఫిర్యాదు చేయనున్నారు. దీంతో ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ వద్ద ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది.

## చీమల ఫోబియాతో మహిళ షాకింగ్ నిర్ణయం



అనేక మంది అనేక రకాల వ్యాధులతో, మానసిక ఇబ్బందులతో చనిపోతుంటారు. ఆరోగ్యం బాగాలేక, లైఫ్ ఫెయిల్యూర్ కావడం, డిప్రెషన్, లోన్ల ఒత్తిడి వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కానీ ఇందుకు భిన్నంగా తాజాగా జరిగిన ఓ ఘటన తీవ్రంగా కలిచివేస్తోంది. ఎలాంటి ఆరోగ్య సమస్యలు, ఫైనాన్సియల్ సమస్యలు, లైఫ్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు లేకపోయినా ఆమె చనిపోయింది. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన సూసైడ్ నోట్ ఒక్కసారిగా షాక్ కు గురి చేస్తోంది. ఇలా కూడా చనిపోతారా? వామ్మో అంటూ ఈ విషయం తెలుసుకున్నవారు ఆశ్చర్యానికి గురవుతున్నారు. తెలంగాణలో జరిగిన ఈ ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. ఓ మహిళ అనూహ్యంగా మరణించిన ఘటన సంగారెడ్డి జిల్లాలో జరిగింది. చీమల ఫోబియాతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అమీన్ పూర్ మున్సిపాలిటీలోని శర్వా హోమ్స్ లో మనీషా ఉరి వేసుకొని సూసైడ్ చేసుకుంది. చీమల ఫోబియాతో తాను చనిపోతున్నానని, తన కూతురు జాగర్త అంటూ సూసైడ్ నోట్ లో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీస్ లు దర్యాప్తు చేస్తున్నారు. చీమల ఫోబియాతో మహిళా చనిపోవడం అన్నది చాలా అరుదైన సందర్భమని గ్రామస్తులు ఆలోచనలో పడ్డారు. గృహిణి మరణించడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

## గ్లామర్ బ్యూటీ
# దివ్య భారతి

గోట్ సినిమాతో తెలుగులో అడుగుపెట్టిన గ్లామరస్ బ్యూటీ దివ్య భారతి. ఈ సినిమాలో తన అందం, నటనతో కుర్రకారును కట్టిపడేసింది. ఓపక్క సినిమాలతో బిజీగా ఉంటూనే మరోపక్క సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటుంది ఈ బ్యూటీ. తాజాగా ఈ అమ్మడు తన లేటెస్ట్ ఫోటో షూట్ ను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఎద అందాలను చూపిస్తూ దిగిన ఈ ఫోటోలు ట్రెండ్ అవుతున్నాయి. మీరు కూడా చూసేయండి.



# పంత్ రీఎంట్రీ



నాలుగు నెలల స్వల్ప విరామం తర్వాత యువ వికెట్‌కీపర్ రిషభ్ పంత్ భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఈనెల 14 నుంచి సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు గాను అజిత్ అగార్కర్ సారథ్యంలోని జాతీయ మెన్స్ సెలక్షన్ కమిటీ బుధవారం జట్టును ప్రకటించగా అందులో పంత్.. వైస్ కెప్టెన్‌గా పునరాగమనం చేశాడు. శుభ్‌మన్ గిల్ సారథిగా వ్యవహరిస్తున్న 15 మంది జట్టులో.. వెస్టిండీస్ సిరీస్‌లో ఉన్న ప్రసిద్ధ్ కృష్ణ, ఎన్. జగదీశన్‌పై వేటు పడగా ఆకాశ్ దీప్ కూడా జట్టులోకి వచ్చాడు. ఈ రెండు మార్పులు తప్ప విండీస్‌తో ఆడిన జట్టునే సెలక్టర్లు కొనసాగించారు. రంజీలో సత్తాచాటుతున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీతో పాటు ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు సెలక్టర్లు మరోసారి మొండిచేయి చూపారు. నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్.. సఫారీలతో తొలి టెస్టు ఆడనుంది.

## షట్‌డౌన్ ఎఫెక్ట్‌తో అమెరికా కీలక నిర్ణయం..
# విమాన సేవల్లో 10 శాతం కోత

అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ నేటితో 38వ రోజుకు చేరుకుంది. దేశ చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగుతున్న షట్‌డౌన్‌గా ఇది చరిత్ర సృష్టించింది. ఈ షట్‌డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఈ షట్‌డౌన్ దేశంలోని పలు విమానాశ్రయాలపై తీవ్ర ప్రభావం పడిన విషయం తెలిసిందే. షట్‌డౌన్ సమయంలో ఎలాంటి జీతం లేకుండా పనిచేస్తున్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, టీఎస్‌ఏ సిబ్బంది అనారోగ్య కారణాలతో విధులకు గైర్హాజర్ కావడంతో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలలో విమానాల రాకపోకలు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. విమాన సేవల్లో కోత విధించేందుకు సిద్ధమైంది. రద్దీ అత్యధికంగా ఉన్న 40 విమానాశ్రయాల్లో 10 శాతం విమానాలను రద్దు చేయనుంది. ఈ మేరకు ఆ దేశ రవాణా శాఖ మంత్రి సీన్ డఫీ ప్రకటించారు. ఈ మార్పులు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. పరిమిత సంఖ్యలో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌పై ఒత్తిడి తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# న్యూయార్కర్స్ అంతా ఫ్లోరిడాకు పారిపోవాల్సిందే

భారత సంతతికి చెందిన 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సవాల్ చేసి మరీ న్యూయార్క్ మేయర్ గా విజయం సాధించారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందించారు. విజయం అనంతరం మమ్దానీ చేసిన ప్రసంగం ఆవేశపూరితంగా ఉందని, ఈ కొత్త మేయర్ కమ్యూనిస్ట్ భావజాలం కలిగిన వ్యక్తి అని విమర్శించారు. న్యూయార్క్ నగరం కమ్యూనిస్ట్ క్యూబా, సోషలిస్ట్ వెనెజువెలా వలే మారుతుందని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నగర ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2024, నవంబర్ 5న ఏర్పడిన తన ప్రభుత్వం పునరుద్ధరించిందని చెప్పారు. ఇప్పుడు న్యూయార్క్‌లో ఆ సార్వభౌమత్వాన్ని కొద్దిమేర కోల్పోయామని అన్నారు. అయితే తాము దానిని జాగ్రత్తగా చూసుకుంటామని చెప్పారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి నగరంలో నిర్వహించిన అమెరికా బిజినెస్ ఫోరంలో ట్రంప్ మాట్లాడారు.

## చెంగిచెర్ల హనుమాన్ నగర్‌లో వీధి కుక్కల భయం, అధికారులకు విజ్ఞప్తి



చెంగిచెర్ల హనుమాన్ నగర్ ప్రాంతంలో వీధి కుక్కల సమస్య తీవ్రమవుతోందని స్థానిక నివాసి రాజేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో గుంపులుగా తిరుగుతూ పిల్లలు, పెద్దలపై భయాందోళన సృష్టిస్తున్నాయని, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజేశ్ మాట్లాడుతూ, "రోజురోజుకు బయట తిరిగే కుక్కల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థులు, మహిళలు రాత్రి బయటికి వెళ్లడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖలు వెంటనే స్పందించాలి" అని అన్నారు. వీధి కుక్కల నియంత్రణకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలను వేగవంతం చేసి నివాసులకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.



## లారీని ఢీకొట్టిన బైక్..
# ఇద్దరు యువకులు దుర్మరణం

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పట్టణంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో అతివేగంగా వచ్చిన బైక్.. లారీని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. గుంటూరు జిల్లా కొరిటపాడుకు చెందిన షేక్ రిజ్వాన్ (21), చింతల నాని (21) సూర్యలంక బీచ్‌కి వెళ్లారు. అయితే బీచ్ మూసివేయడంతో తిరిగి గుంటూరుకి బయల్దేరారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 2.34 గంటల సమయంలో బాపట్ల గడియారం స్తంభం కూడలి వద్ద చీరాల నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అమాంతం ఎగిరిపడి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.